మనిషికి ఉద్యోగం ఇస్తానని తెగ గారాలు పోతూ, వంట నేర్చుకోలేదు. ఇక్కడ నేను ఆర్డర్స్ తీసుకుంటాను'' అంది.

ఆమె ఆ బాధను అధిగమించినట్టుంది. యాసిడ్ దాడి గురించి చెప్పినప్పుడు ఎటువంటి హావభావాలూ కనబరచలేదు అనుకుంది సాగరిక.

తరువాతి అమ్మాయి..

''నా పేరు మోనాలిసా. నేను మా అమ్మ కడుపులో ఉన్నప్పుడు మా నాన్నగారు మోనాలిసా చిత్రాన్ని చూశారట. అందుకే, నాకు ఆ పేరు పెట్టారు. నా మానాన నేను చదువుకుంటుంటే.. ఒకరోజు మా కాలేజీలోకి ఒక తెలియని వ్యక్తి వచ్చి నా మొహంపై యాసిడ్ పోశాడు. చదివేది మెడికల్ కాలేజీలోనైనా నా కర్మని నేను అధిగమించలేను కదా! అందుకని నా మొహం ఇలా అయ్యింది. చివరికి తెలిసిందేమంటే.. మా అన్నయ్య రోడ్డు రోమియోలా ఎవరో అమ్మాయి వెంటపడితే, వాడికి బుద్ధి చెప్పడానికి ఆ అమ్మాయి వాళ్లన్నయ్య నాపై దాడి చేశాడు. అన్నయ్య ఉంటే నా వెంట మగాళ్లు పడరనుకున్నాను గానీ.. మా అన్న వల్లే నాకిలా నష్టం జరుగుతుందనుకోలేదు. కాలిన మొహంతో క్లాస్‌రూమ్‌కి వెళ్లడానికి అప్పట్లో ధైర్యం సరిపోక చదువు అటకెక్కింది. ఇక్కడికి వచ్చాక ధైర్యం వచ్చింది. సంతోషం వచ్చింది'' అంది.

మరో అమ్మాయి..

''నా పేరు స్ఫూర్తి. నా బాయ్‌ఫ్రెండ్ నన్ను ప్రలోభపెట్టి, నన్ను వదిలించుకోడానికి ప్రయత్నించాడు. నేను స్త్రీల కమిషన్‌కి ఫిర్యాదు చేస్తానన్నాను. వాడు నన్ను పెళ్లి చేసుకుంటానని చెప్పి, నన్ను చంపే ఉద్దేశంతో నా మీద యాసిడ్ పోశాడు. నేను బతికిపోయాను గానీ, నా కడుపులో ఉన్న వాడి పాపం మాత్రం.. వాడు పోసిన యాసిడ్‌తోనే పోయింది. ఇక్కడికి వచ్చి తల ఎత్తుకు బతుకుతున్నాను'' అంది.

ఈ అనుభవాలు పంచుకునే అమ్మాయిలు వాళ్ల వయసుకు మించిన పరిపక్వతను కనబరిచారు. అది చూసి సాగరికలో ఇన్నాళ్లుగా పేరుకుపోయిన నిరాశ, నిస్పృహ వెంటనే మటుమాయమయ్యాయి. ఒకప్పటి చేపల్లాంటి కళ్లు మౌనంగా కన్నీరు కార్చడం మానేశాయి. వాళ్లను చూసి, తను నేర్చుకోవాల్సింది చాలా ఉందని అర్థమైంది. తరువాత తనను తాను నిర్భయంగా, నిబ్బరంగా పరిచయం చేసుకుంది. అనతి కాలంలోనే ఆమె వాళ్లకు తగ్గ ధైర్యవంతురాలయ్యింది.




* * *

కొన్నాళ్లు గడిచాక...

మరో కొత్త అమ్మాయి వీళ్ల బృందంలో సభ్యురాలిగా చేరింది. పేరు స్వీటీ! మోడల్‌గా ఎదగాలని అనుకుందట. గిట్టని వాళ్లెవరో యాసిడ్‌తో దాడి చేయించారట. ఒక చెంప మాత్రం కాలింది. కాస్మెటిక్ సర్జరీకి డబ్బులు లేక ఇక్కడికి వచ్చిందట. చిన్నపిల్ల అవడం వల్ల నిజమవని కోరికలు, నెరవేరని కలలు.. ఈ రెండిటినీ తలుచుకుంటూ బాధపడుతూ ఉండేది. మిగతా అమ్మాయిలు ఆమెకు ఊరట నివ్వడానికి శాయశక్తులా ప్రయత్నించేవారు. ముఖ్యంగా సాగరిక..

''నీలాంటి మంచి అమ్మాయి మీద దాడి చేయించారంటే వాళ్లు ఎంత కుళ్లుబోతులో అర్థం అవుతోంది. అలాంటి ఫీల్డ్ ఎందుకు? అది కాకపోతే వేరే ఉద్యోగాలే లేవా? ఏం.. ఇప్పుడు మనం చేస్తున్నది ఉద్యోగం కాదా? మనకి కావాల్సినంత తిన్నాక కూడా పొదుపు చేసుకోగలుగుతున్నాం. కొన్ని డబ్బులు పోగయ్యాక కావాల్సిన బట్టలూ, నగలూ కొనుక్కోవచ్చు. మనమందరం అందరి కోసం నిలబడి, తలెత్తుకుని బతుకుదాం. డోంట్ వర్రీ!'' అని ధైర్యం చెప్పేది.

''ఈ మొహానికి ఖరీదైన బట్టలూ, నగలూ కూడానా? ప్చ్!'' అని స్వీటీ నిట్టూర్చితే..

''నేనూ ఇలాగే ఉండేదాన్ని. మన సహచరులను చూడు.. వాళ్లు కూడా ఇదే బాధను అనుభవించి, పోటీపడి దాన్ని అధిగమించారు. రేపు నీకు ఒక చీటీలో ఎవరెవరు ఎంత కాలం తీసుకున్నారో రాసిస్తాను. నీతో నువ్వే పోటీ పడాలి. ఫ్యాషన్ పరేడ్ కన్నా ఇది ఇంకా వైవిధ్యంగా ఉంది కదూ!'' అని ప్రోత్సహించేది సాగరిక.

* * *

ఆ రెస్టారెంట్‌లో పని చేసేవారికి తలలో నాలుకలా అయిన సాగరిక, ఊళ్లో గర్భిణులకు పోషకాహారం మీద ఒక ఉచిత శిబిరం ఏర్పాటు చేయించింది. తద్వారా పరోక్షంగా స్త్రీలలో తమబోటి వారి పట్ల అవగాహన పెంచి, వారిపట్ల న్యూనత తగ్గించే ప్రయత్నం చేసింది. దానికి మంచి స్పందన లభించడంతో